
రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

మెళియాపుట్టి : గిరిజన గ్రామాల్లో చేపడుతున్న బి.టి రోడ్డు పనులను వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.రవి అధికారులను ఆదేశించారు. మండలంలోని గిరిజన గ్రామమైన సవరకుడ్డలో చేపడుతున్న బి.టి రోడ్డు పనులను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. పనుల నాణ్యతను పరిశీలించి, ఇంజినీరింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామ ప్రజల రాకపోకలకు అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టడంతో పాటు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గిరిజన గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ టెక్కలి ఇఇ ఎ.సూర్యప్రకాష్, పాతపట్నం డిఇ ఆర్.ఎస్ ప్రసాద్, సర్పంచ్ సవర వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వేదన

సచివాలయాల చుట్టూ తిరుగుతున్న బాధితులు



- ఒకే ఆధార్ కార్డుతో ఒకటికి మించి విద్యుత్ కనెక్షన్లు
- భూ సర్వే లోపాలతో రైతుల పేరుతో అదనపు భూమి నమోదు
- రకరకాల సాంకేతిక కారణాలతో పథకానికి నోచని వైనం

బూర్జ మండల కేంద్రానికి చెందిన భవిరి పాపారావు పేరున ఏకంగా 54 విద్యుత్ కనెక్షన్లు ఉన్నట్లు చూపి ఆ కుటుంబంలోని పిల్లలకు తల్లికి వందనం ఇవ్వలేదు. పొందూరులో 31, ఎచ్చెర్లలో 12, రణస్థలం, లావేరులో మూడేసి చొప్పున, జి.సిగడాంలో నాలుగు విద్యుత్ మీటర్లు ఉన్నట్లు సచివాలయంలో చెప్పడంతో, ఒక్కసారిగా అతను షాక్‌కు గురయ్యాడు. వాస్తవానికి ఆయనకు కనీసం సొంత ఇల్లూ లేదు. దాన్ని సరిచేయాలని విద్యుత్‌శాఖ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేకపోవడంతో ఉసూరుమంటున్నాడు.

రణస్థలం మండలం కొవ్వాడ గ్రామానికి చెందిన మైలపల్లి పొట్టమ్మది మరో సమస్య. ఈ కుటుంబం సరాసరిన 50 యూనిట్ల కరెంట్ మాత్రమే వాడతారు. వీరికి సాధారణంగా సగటున నెలకు రూ.200 నుంచి రూ.250 మించి బిల్లు ఏ నెలా రాలేదు. అటువంటిది ఏకంగా 300 యూనిట్లు వినియోగించడం వల్లే డబ్బులు రాలేదని సచివాలయ సిబ్బంది చెప్పడంతో వారు అవాక్కయ్యారు.


జిల్లాలో చాలా మంది తల్లులది ఇదే పరిస్థితి. తల్లికి వందనం పథకానికి విధించిన అనేక ఆంక్షలతో వేలాది మంది లబ్ధిదారులు దూరం కాగా, హడావుడిగా అమలు చేసిన క్రమంలో అనేక సాంకేతిక సమస్యలతో మరికొంత మంది తల్లులు దూరమవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో తల్లికి వందనం పథకం కింద 2,28,659 విద్యార్థులకు సంబంధించి 1,52,563 మంది తల్లుల ఖాతాలో ప్రభుత్వం ఈనెల 13వ తేదీన రూ.13 వేలు చొప్పున నగదు జమ చేసింది. అన్ని అర్హతలు ఉన్నా పథకానికి నోచని వారు ఇప్పుడు ఒక్కొక్కరుగా బయటపడుతున్నారు. యునిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ (యుడిఐఎస్ఇ) ప్రకారం ఒకటి నుంచి పదో తరగతి వరకు 2,76,593 మంది చదువుతున్నారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో అడుగు పెట్టిన వారు సుమారు 20 వేలు మంది ఉన్నారు. పదో తరగతి నుంచి ఇంటర్ మొదటి సంవత్సరంలోకి ప్రవేశించిన వారికి జూలైలో తల్లికి వందనం డబ్బులను ప్రభుత్వం జమ చేస్తుందని అధికారులు చెప్తున్నారు. దీంతో వారిని మినహాయించగా, పథకానికి 2,96,593 మంది అర్హత సాధించినట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి.

వందనానికి బంధనాలు

ప్రభుత్వం ప్రకటించిన అర్హుల జాబితాకు, ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థుల సంఖ్యకు భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. సుమారు 67,934 మంది పథకానికి నోచుకోలేనట్లుగా లెక్కలు చెప్తున్నాయి. వీటిలో ప్రభుత్వం విధించిన అనేక ఆంక్షలతో పాటు సాంకేతిక కారణాలూ ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి.



రూ.పది వేలు వేతనం పొందుతున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు తదితర చిరుద్యోగుల కుటుంబాలకు చెందిన తల్లులను అనర్హులుగా పేర్కొంది. కరెంట్ వినియోగం 300 యూనిట్లు దాటితే అటువంటి కుటుంబాలకూ సాయం నిరాకరించింది. ఐదు ఎకరాల పల్లం లేదా పదెకరాల మెట్టు భూమి ఉన్నా వారినీ అనర్హుల జాబితాలో చేర్చింది. నాలుగు చక్రాల వాహనాలు, ఆదాయపు పన్ను చెల్లించే కుటుంబాలకూ పథకం వర్తింపజేయలేదు.

కొంపముంచిన సాంకేతిక సమస్యలు

తల్లికి వందనం పథకం అమల్లో తలెత్తిన అనేక సాంకేతిక సమస్యలు అసలైన లబ్ధిదారులకు తీవ్ర అన్యాయం జరిగింది. గత వైసిపి ప్రభుత్వంలో చేపట్టిన భూ సమగ్ర సర్వే సందర్భంగా అనేక భూ సమస్యలు తలెత్తాయి. అవి ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉండడంతో తల్లికి వందనం పథకం అమలుపై ప్రభావం చూపింది.

జాయింట్ ఎల్‌పిఎం (ల్యాండ్ పార్సిల్ మ్యాప్)లు, ఆధార్ అనుసంధానంలో తప్పిదాలు, మ్యుటేషన్ల సమస్య కారణంగా భూముల విస్తీర్ణంలో బాగా తేడాలు వచ్చాయి. ప్రధానంగా జాయింట్ ఎల్‌పిఎం కారణంగా రైతుకు ఐదెకరాల్లోపు భూమి ఉన్నా వెబ్‌సైట్‌లో 30, 40 ఎకరాల భూమి ఉన్నట్లు చూపుతోంది. విద్యుత్ కనెక్షన్లకు ఒకే ఆధార నంబరు అనుసంధానం కావడంతో, ఒకటికి మించి అదనంగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయన్న కారణంతో చాలా మంది తల్లులు పథకానికి దూరమయ్యారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

9న అఖిల భారత సమ్మె

జయప్రదం చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

కార్మిక హక్కులు కాలరాసే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు జూలై 9న చేపడుతున్న అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో అఖిల భారత సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మె సందర్భంగా అన్ని మండల కేంద్రాల్లో నిర్వహించే ప్రదర్శనల్లో కార్మికులు, స్కీమ్‌వర్కర్లు పాల్గోవాలని కోరారు. ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో కనీస వేతనం నెలకు రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. దశాబ్దాల పాటు కార్మిక వర్గం పోరాడి అశేష త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారీ ప్రయోజనాల కోసం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చివేసిందని విమర్శించారు. కార్మిక సంఘాలను బలహీనం చేసి యాజమాన్యాల శ్రమ దోపిడీని మరింత పెంచుకోవడం కోసం, పెట్టుబడిదారులకు ఉద్యోగులను, కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చే విధంగా కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. ప్రజాధనంతో నిర్మించుకున్న విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగ పరిశ్రమలు, రైల్వేలు, బ్యాంకులు, ఎల్ఐసి, రక్షణ రంగం, గనులు, ప్రకృతి వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రైవేటీకరణను వేగవంతంగా అమలు చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతూ కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంభిస్తూ కార్మిక, కర్షకులకు ద్రోహం చేస్తోందన్నారు. మరోవైపు ప్రజలపై భారాలు మోపుతోందని విమర్శించారు. అంగన్వాడీలకు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అఖిల భారత సమ్మెను జయప్రదం చేసి కేంద్ర కార్మిక ఐక్యత చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆదినారాయణమూర్తి, అల్లు సత్యనారాయణ, కె.సూరయ్య, ఎన్.వి రమణ, ఎన్.గణపతి, ఎస్.లక్ష్మీనారాయణ, నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని దారులూ విశాఖ వైపే...

- యోగా డేలో పాల్గొనేందుకు బస్సుల్లో బయలుదేరిన జనం
- 500 ప్రభుత్వ, ప్రైవేట్ బస్సులు వినియోగం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

అంతర్జాతీయ యోగా డేలో భాగంగా విశాఖలో నిర్వహించనున్న సామూహిక యోగాసనాల కోసం జిల్లా నుంచి అధిక సంఖ్యలో జనం తరలివెళ్లారు. ఎచ్చెర్ల, శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట, నియోజకవర్గాల పరిధిలోని 14 మండలాల నుంచి 20,580 మందిని తరలించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రజలను తరలించడానికి 497 ప్రైవేట్, విద్యా సంస్థల బస్సులతో పాటు ఆర్‌టిసి 150 బస్సులను ఏర్పాటు చేసింది. అవి శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకే మండల కేంద్రాలకు చేరాయి. మండలంలోని అన్ని గ్రామాల నుంచి మండల కేంద్రానికి జనాన్ని తీసుకొచ్చారు. వారిని కళ్యాణ మండపాలు, ఇతర ఖాళీ భవనాల్లో ఉంచారు. భోజనాల అనంతరం అర్ధరాత్రి తర్వాత బయలుదేరారు. ప్రయాణంలో ఇబ్బందులు తలెత్తకుండా మార్గమధ్యంలో దాబాలు, ఇతర ప్రాంతాల్లో మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్, ప్రయాణాల్లో ఇబ్బందులు తలెత్తితే పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను సైతం ఏర్పాటు చేశారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కెవి మహేశ్వరరెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో ప్రధాన బాధ్యతలు చూస్తున్న అధికారులు ఇప్పటికే విశాఖలో మకాం వేశారు. జనాలు తరలింపు, బస్సులు ఇతర బాధ్యతలు చూస్తున్న వారు బస్సులు బయలుదేరిన తర్వాత వెళ్లారు.

ప్రయాణికులకు తప్పని పాట్లు

యోగా డేకు ఆర్‌టిసి మొత్తం 220 బస్సులను వినియోగిస్తోంది. ఇందులో యోగాకు వెళ్లే వారి కోసం 150 బస్సులు ఉపయోగిస్తుండగా మరో 70 బస్సులను అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకు పంపారు. వీటితో పాటు ఇతర ప్రైవేట్, ఒడిశా బస్సులను సైతం ప్రజలను తరలించడానికే ఉపయోగిస్తున్నారు. దీంతో శుక్రవారం సాయంత్రం నుంచే బస్సుల కోసం ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. శనివారం ఈ పరిస్థితి మరింత తీవ్రంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి.

జిల్లావ్యాప్తంగా ఆరు వేల చోట్ల యోగా

విశాఖలో యోగా డే ఉదయం 6.30 గంటల నుంచి 8 గంటల వరకు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అదే సమయంలో జిల్లావ్యాప్తంగా ఆరు వేలకు పైగా కేంద్రాల్లో యోగా నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థులు, సామాన్య ప్రజలను భాగస్వాములను చేస్తూ యోగాసనాల కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు.





పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

23న యువత పోరు

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీ అమలు చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ డిమాండ్ చేశారు. పేద విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై ఈనెల 23న యువత పోరులో భాగంగా కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో యువత పోరుబాట పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో అన్ని వర్గాల ప్రజలనూ మోసం చేస్తోందని విమర్శించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. పేద విద్యార్థుల భవిష్యత్‌తో కూటమి ప్రభుత్వం ఆటలాడుకుంటోందని ధ్వజమెత్తారు. నిరుద్యోగ భృతి విషయంలోనూ ప్రభుత్వం మాట తప్పిందన్నారు. నిరుద్యోగ భృతి పేరుతో నెలకు రూ.మూడు వేలు ఇస్తామని యువతను మోసం చేసిందన్నారు.


మరోవైపు ఉద్యోగావకాశాలూ లేక నిరుద్యోగ యువత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లికి వందనం పేరుతో తల్లులకు వంచన చేశారని విమర్శించారు. 20 లక్షలు ఉద్యోగాలు యువతకు ఇప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. రూ.15 వేలు ఇస్తామని చెప్పి, రూ.13 వేలు అందజేశారన్నారు. అనేక ఆంక్షలతో అనేక మందికి పథకం అందలేదన్నారు. కొత్త పింఛన్ల కోసం అనేక మంది ఎదురు చూస్తున్నారని చెప్పారు. వైసిపి ప్రజల తరుపున పోరాటం చేస్తోందన్నారు. కక్షసాధింపులు, బెదిరింపులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, పార్టీ పరిశీలకులు కంభంపాటి రవిబాబు, మాజీ ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, నాయకులు పేరాడ తిలక్, దుంపల రామారావు, మామిడి శ్రీకాంత్, చింతాడ రవికుమార్, మెంటాడ వెంకట స్వరూప్ పాల్గొన్నారు.

చెక్‌పోస్టులో నిరంతరం అప్రమత్తం

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం, సోంపేట

ఆంధ్రా-ఒడిశా సరిహద్దు చెక్‌పోస్టు వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇచ్ఛాపురం మండలం పురుషోత్తపురం వద్ద ఉన్న సరిహద్దు చెక్‌పోస్టు, ఎక్సైజ్ స్టేషన్, సోంపేటలోని ఎక్సైజ్ స్టేషన్‌ను శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి నమోదైన కేసుల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిహద్దు మీదుగా ఎటువంటి మత్తు పదార్థాల రవాణా కాకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. కేసులు నమోదై పరారీలో ఉన్న, అరెస్టు కాని వారిని తక్షణమే అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచాలని ఆదేశించారు. ఛార్జిషీట్‌లు పెండింగ్‌లో లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నవోదయం 2.0 లక్ష్యాలను చేరుకోవడానికి సూచనలు చేశారు.
తీర ప్రాంతాల్లో తరచూ తనిఖీలు చేసి నాటుసారా అమ్మకాలు, రవాణా లేకుండా నిరోధించాలని ఆదేశించారు. ఎక్సైజ్ సర్కిల్‌లోని మండలాల్లో నాటుసారా గ్రామాలను నాటుసారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి అవగాహనా సదస్సులు, నేర నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. గతంలో నాటుసారా అమ్మకాలు చేసి, మానేసిన వారికి ఇతర ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. నాటుసారా కేసుల్లో ఉన్న వారిని స్థానిక తహశీల్దార్ వద్ద బైండోవర్ చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిఐలు పి.దుర్గాప్రసాద్, జి.వి రమణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ శ్రీనివాసరావు, టాస్క్‌ఫోర్స్ సిఐ మధుకుమార్, ఎస్ఐలు కళ్యాణి, కుమార్, గురుమూర్తి, సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎక్సైజ్ డిసి శ్రీకాంత్ రెడ్డి


సాగు భూములు దక్కేలా చూడండి

ఎస్‌టి కమిషన్ చైర్మన్‌కు గిరిజనుల వినతి

ప్రజాశక్తి - విజయనగరం, మందస

గిరిజనుల సాగులో ఉన్న భూములు దక్కేలా చూడాలని మందస మండలం చీపి పంచాయతీకి చెందిన గిరిజనులు రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డి.వి.జి శంకరరావును కోరారు. విజయనగరం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. చీపి పంచాయతీ పరిధిలోని బెత్తుకోలలో 15 గిరిజన కుటుంబాలు బుడారిసింగిరెలో సర్వే నంబరు 35564 భూమి సాగు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారని గిరిజన ఐక్య వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మీనారాయణ తదితరులు చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు.

సాగు భూములు గిరిజనులకే చెందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో వైద్య సమస్యలు తలెత్తినప్పుడు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. తమ ప్రాంతంలో పర్యటించాలని కమిషన్ చైర్మన్‌కు విజ్ఞప్తి చేయగా, ఆయన సానుకూలంగా స్పందించారు.



ఎస్‌టి కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

ఆశాలను కార్మికులుగా గుర్తించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఆశావర్కర్లను కార్మికులుగా గుర్తించాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.ధనలక్ష్మి, జి.అమరావతి, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు అన్నారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు జూలై 9న చేపడుతున్న దేశవ్యాప్త సమ్మెలో ఆశా వర్కర్లు పాల్గొంటారని తెలియజేస్తూ సమ్మె నోటీసును జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కె.అనితకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశాలకు ఒప్పంద జిఒలు విడుదల చేయాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. 20 ఏళ్లుగా ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశావర్కర్లను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలన్నారు. ఖాళీగా ఉన్న ఆశావర్కర్ల నియామకాలు చేపట్టాలన్నారు. విధినిర్వహణలో ప్రమాదవశాత్తు, అనారోగ్యంతో ఆశావర్కర్లు మృతి చెందుతున్నారని, ప్రభుత్వం గ్రూప్ ఇన్సూరెన్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఏజెన్సీలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆశాలకు రూ.10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు.



డిఎంహెచ్‌ఒకు సమ్మె నోటీసును అందజేస్తున్న యూనియన్ నాయకులు

6 నుంచి హరికథా నవరత్నాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సాంస్కృతిక సంస్థ శ్రీ సుమిత్ర కళా సమితి నేతృత్వాన జూలై ఆరో తేదీ నుంచి హరికథా నవరత్నాల పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళా సమితి అధ్యక్షులు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు. నగరంలోని ఒక కళ్యాణ మండపంలో సంస్థ ప్రతినిధులు శుక్రవారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ కార్యనిర్వాహక కార్యదర్శి పులఖండం శ్రీనివాసరావు సంస్మరణార్థం ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమానికి పలువురు దాతలు సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. భారతీయ కళలకు పూర్వ ప్రాభవానికి తమ సంస్థ ఇప్పటికే అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఆ ఒరవడిలో హరికథా నవరత్నాలు పేరిట చేపడుతున్నామని చెప్పారు. తొలి రోజు ప్రదర్శనలో భాగంగా సుందరకాండను తిరువళ్లూరి దివ్య శివ భాగవతారిణి వినిపించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో శ్రీ సుమిత్ర కళా సమితి ప్రధాన కార్యదర్శి గుత్తు చిన్నారావు, కోశాధికారి నక్క శంకరరావు, ఉపాధ్యక్షులు మండవల్లి రవి, కిల్లాన ఫల్గుణరావు, కొంక్యాన మురళీధర్, వి.వి.ఆర్ మూర్తి, ఎం.వరలక్ష్మి, పూజ, ఉషారాణి పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కళా సమితి ప్రతినిధులు

భూ సమస్యల పరిష్కారానికి
ఈనెల 30 వరకు గడువు

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో జాయింట్ పట్టాదారులుగా వెబ్‌ల్యాండ్-2.0లో నమోదైన రైతులు ప్రభుత్వ పథకాలు పొందడంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ప్రత్యేక సబ్ డివిజన్ డ్రైవ్ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ డ్రైవ్‌లో భాగంగా రెవెన్యూ శాఖ సాధారణంగా వసూలు చేసే రూ.500 రుసుమును మినహాయించి, రూ.50 నామమాత్రపు దరఖాస్తు రుసుముతోనే జాయింట్ పట్టాల విభజన చేసేందుకు వీలు కల్పించినట్లు తెలిపారు. ఈ సేవలు ఉచితంగా లభించనున్నాయని, ఈనెల 30వ తేదీ లోపు సంబంధిత గ్రామ సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. భూ వివరాల విభజన అనంతరం అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఇతర పథకాల కోసం రైతులు అర్హులుగా పరిగణించబడతారని స్పష్టం చేశారు.

ఇప్పటికే పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న జాయింట్ పట్టాదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అన్నదాత సుఖీభవలో అర్హత కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వివరించారు. పేద రైతులకు ఇది గొప్ప అవకాశమని, ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.



ఎమ్మెల్యే రవికుమార్‌కు వినతులు అందజేస్తున్న ప్రజలు

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

ఆమదాలవలస: ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వెంటనే పరిష్కరించడమే ప్రజాదర్బార్ ఉద్దేశమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు మండలాలు, మున్సిపాలిటీ పరిధి నుంచి వచ్చిన ప్రజలు విభిన్న సమస్యలపై అర్జీలు సమర్పించారు. నియోజకవర్గంలోని ఎలాంటి సమస్యలైనా టిడిపి కార్యాలయానికి ఎప్పుడైనా రావచ్చునని, సమస్యలను అర్జీల రూపంలో పంపితే పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నారాయణపురం ఆనకట్టు చైర్మన్ సనపల ఢిల్లేశ్వరరావు, ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు, పివివికె రాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మె నోటీసు



వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

కొత్తూరు: అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి జూలై 9న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటామని ఐసిడిఎస్ అధికారులకు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అండ్ మినీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్.ధనలక్ష్మి, సిహెచ్ జలజాక్షి, కె.కన్నంబ, ఎస్.రమణమ్మలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. అలాగే ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచలేదని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని అవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీలకు తల్లికి వందనం, ఇతర సంక్షేమ పథకాలు వర్తింపు చేయాలని 23న జిల్లా అధికారులకు వినతిపత్రం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కె.నిర్మల, టి.నీలవేణి, ఎం.విజయమ్మ ఉన్నారు.

పెన్షనర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గం

రణస్థలం: రణస్థలం సబ్ ట్రెజరీ పరిధిలో ఉన్న పెన్షనర్స్ నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం సబ్ ట్రెజరీ కార్యాలయ ఆవరణలో జరిగింది. అధ్యక్షులుగా పిన్నింటి సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా మాడుగుల రామారావు, ట్రెజరర్‌గా ఎం.వి.రమణ, అసోసియేట్ అధ్యక్షులుగా గణేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా బాలి రామునాయుడు, ఎన్.శ్యామ్ సుందరరావు, జాయింట్ సెక్రెటరీలుగా నల్లి అప్పలనాయుడు, ఎం.కృష్ణానందం, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా ఆర్.లక్ష్మణరావు, ఎస్.వి.రమణ, కె.శివరాం, జిల్లా కమిటీ సభ్యులుగా దాకోజు వెంకటరావు, మళ్లిపెద్ది నారాయణమూర్తి, ఎం.వి.రమణ, కో-ఆర్డినేషన్ కన్వీనర్‌గా చిక్కాల గోపాలరావు, మీడియా ప్రతినిధిగా పున్నాన నరసింహుల నాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలు ఇవ్వండి... గిఫ్ట్ పొందండి



పొందూరులో సేకరిస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్రజాశక్తి- పొందూరు

పర్యావరణ పరిరక్షణకు ప్రజల సహకారాన్ని కోరుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు ఇవ్వండి.. బహుమతులను పొందండంటూ పొందూరుకు చెందిన ఆడపిల్ల సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడ్డి లావణ్య చేపట్టిన విన్నూత కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుంది. శుక్రవారం పాత పంచాయతీ భవనం వద్ద సేవాసొసైటీ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ మేళా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటివద్దగాని, దుకాణాలు వద్దగాని సేకరించిన ప్లాస్టిక్‌ను బయట పార వేయకుండా, కాల్చకుండా బాధ్యతతో తమకు అప్పగిస్తే వారికి తగిన బహుమతులను అందజేస్తామన్నారు. ప్లాస్టిక్ వలన పర్యావరణానికి కలుగుతున్న నష్టాన్ని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈనెల 20 నుంచి 26 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రేగడి లక్ష్మి, టిడిపి మండల ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరి, పట్టణ అధ్యక్షుడు శ్రీరంగనాయకులు, ఇఒ మోహన్‌బాబు, టిడిపి నాయకులు దండా మురళీ, కాలెపు శ్రీనివాసరావు, కోరుకొండ విజయ్‌కుమార్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

ఇచ్ఛాపురం: నూతన విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని విద్యా శాఖాధికారులు అప్పారావు, విశ్వనాథ్ సూచించారు. శుక్రవారం మండలంలోని విద్యా వనరుల కేంద్రంలో అన్ని పాఠశాలల హెచ్‌ఎంలకు ఎంఇఒలు కురమణ అప్పారావు, ఎస్.విశ్వనాథం అధ్యక్షతన నిర్వహించారు. పాఠశాల నిర్వహణ తదితర అంశాలను ఎంఇఒలు వివరించారు. ప్రతి ఉపాధ్యాయుడు నూతన విద్యార్థులను ఈ నెల 25లోగా ఆన్‌లైన్‌లో నమోదు తప్పనిసరిగా చేయాలని సూచించారు. పాఠశాల సమయపాలన తప్పకుండా పాటించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా నిర్వహించాలని, ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రామారావు మాట్లాడుతూ శనివారం యోగాంధ్ర కార్యక్రమాన్ని అన్ని పాఠశాలల్లో ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు నిర్వహించాలన్నారు.

అక్రమ నిర్మాణాలను గుర్తించాలి

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలను గుర్తించి వాటిపై కోర్టులో కేసు నమోదు చేయాలని మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సచివాలయం ప్లానింగ్ కార్యదర్శులతో కలిసి మున్సిపల్ టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో అక్రమ కట్టడాలను గుర్తించి కేసులు నమోదు చేసి మున్సిపాలిటీకి ఆదాయం పెంచాలన్నారు. ఇంటి నిర్మాణం చేస్తున్న గృహ యజమానులను గుర్తించి వారితో బిల్డింగ్ అప్లికేషన్లు పెట్టించి వారికి బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్‌పై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న వారిని గుర్తించి తగుచర్యలు తీసుకొనేందుకు సచివాలయ సిబ్బంది సహకరించాలన్నారు. సచివాలయం ప్లానింగ్ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పూడికతీత పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న రామకృష్ణ నాయుడు

బూర్జ: మండలంలో ఒనిగడ్డ కాలువ పూడిక తీత పనులు మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ నాయుడు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.20 లక్షలతో సుమారు 22.20 కిలోమీటర్ల మేర ఒనిగెడ్డ కాలువ పూడికతీత పనులు ఖరీఫ్ ముందే తొలగిస్తున్నామన్నారు. ఈ ఏడాది ఒనిగెడ్డ ఆయకట్టు 7 వేల 48 ఎకరాలు సాగు జరగాల్సి ఉందని, శివారు భూములకు సాగునీరు అందించేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. నీటిపారుదల శాఖ జెఇ బాలయ్య, తోట్లపల్లి కాలువ అధ్యక్షులు అడగల కృష్ణ, దేవాడ శ్రీనివాసరావు, దాశరెడ్డి మౌళీశ్వరరావు, వావిలపల్లి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.


వెన్నుపోటు పుస్తకావిష్కరణ

కొత్తూరు: మండల కేంద్రంలోని డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద వైసిపి నాయకులు వెన్నుపోటు పుస్తకం శుక్రవారం ఆవిష్కరించారు. ఎంపిపి సవర సావిత్రి, వైసిపి మండల అధ్యక్షులు గండివలస ఆనందరావు, నాయకులు చింతాడ సూర్యనారాయణ, ఎంపిటిసి వి.లక్ష్మీనారాయణ, సర్పంచ్ ప్రతినిధి అగతముడి రంజిత్, సర్పంచ్ నాస బాలకృష్ణ, బి.నగేష్, పోలయ్య, సవర రమేష్, నాగేశ్వరరావు, రాజులనాయుడు, అప్పన్న, పకీరు పాల్గొన్నారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవ వేడుకలు



ఇచ్ఛాపురం : సర్టిఫికెట్‌లు అందజేస్తున్న ఇన్‌ఛార్జి తహశీల్దార్ శ్రీహరి



కవిటి : విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద శుక్రవారం రెవెన్యూ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బ్రిటిష్ దొరలు పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన రెవెన్యూ వ్యవస్థ 238 ఏళ్లుగా సేవలందిస్తోంది. 1786 జూన్ 20న బోర్డ్ ఆఫ్ రెవెన్యూ అందుబాటులోకి వచ్చిందని ఇన్‌ఛార్జి తహశీల్దార్ బలివాడ శ్రీహరి అన్నారు. రెవెన్యూ అధికారుల్లో అంకితభావం మరింత పెంచడానికి, శాఖ ఔన్నత్యాన్ని మెరుగు పరచడానికి ప్రభుత్వం రెవెన్యూ దినోత్సవం నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. అందులో భాగంగానే రెవెన్యూ కార్యాలయం వద్ద పలువురికి సర్టిఫికెట్లు అందించారు. అహర్నిసలు ప్రజాసేవలో నిమగ్నమైన రెవెన్యూ ఉద్యోగులకు రెవెన్యూ డే ద్వారా గుర్తింపు ఇవ్వడం హర్షణీయమన్నారు. సివిల్ సప్లై డిటి సంతోష్ కుమార్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కవిటి: రెవెన్యూ డే వేడుకలు కవిటి తహశీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులు గొండ్యాల రామమూర్తి, బార్ల జగన్నాథం, బార్ల ధనుంజయం, మార్పు అప్పలరాజును సత్కరించి అప్పట్లో వారు చేసిన సేవలు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కృష్ణమూర్తి, మండల సర్వేయర్ మల్లికార్జున్ పాణిగ్రాహి, విఆర్‌ఒల సంఘం అధ్యక్షుడు వజ్జ బాలకృష్ణ, మండలంలోని విఆర్‌ఒలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మెళియాపుట్టి: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డే కార్యక్రమం నిర్వహించారు. పదవీ విరమణ పొందిన అధికారులకు, ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. సీనియర్ అసిస్టెంట్ జగన్మోహనరావు, రంజిత్ కుమార్, సర్వేయర్ శ్యామలరావు, విఆర్‌ఒలు, విఆర్‌ఎలు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: రెవెన్యూ దినోత్సవాన్ని స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ఇన్‌ఛార్జి తహశీల్దార్ రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి పాల్గొన్నారు. సీనియర్ విశ్రాంత ఉద్యోగులను శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మామిడి రాము, కోళ్ల లవకుమార్, ప్రపుల్లపరిడా, విఆర్‌ఒలు శ్యాం, యుగంధర్, గున్న కోటేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పలాస: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ వాయిలపల్లి గిరిబాబు అధ్వర్యంలో ఉత్తమ సేవలు అందించిన రెవెన్యూ అధికారులకు సన్మానించారు. కార్యక్రమంలో విఆర్‌ఒలు ఖగేశ్వరరావు, ప్రసాదరావు, సర్వేయర్ గిరి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నందిగాం: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఆర్.రామారావు అధ్యక్షతన రెవెన్యూ దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. పదవీ విరమణ పొందిన ఆర్‌ఐ కామేశ్వరరావు, విఆర్‌ఒలు ఎం.సీతారాం, మోహనరావు, పల్గుణరావు, శ్యామ్‌సుందరరావు, ప్రగడ రామారావు తదితరులను సన్మానించారు.

బూర్జ: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ వై.వి.పద్మావతి ఆధ్వర్యంలో రెవెన్యూ డే నిర్వహించారు. కార్యక్రమంలో డిటి బి.సత్యవతి, ఆర్‌ఐ, విఆర్‌ఒలు, సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి నిర్మల

రాజీ మార్గమే రాజమార్గం

టెక్కలి: జూలై 5న నిర్వహించనున్న జాతీయ లోక్ అధాలత్‌ను న్యాయవాదులు, కక్షిదారులు, పోలీస్‌లు సద్వినియోగం చేసుకోవాలని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి బి.నిర్మల కోరారు. శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు రాజీ మార్గమే రాజమార్గం అన్నారు. కేసులు రాజీలో భాగంగా పోలీసులు, న్యాయవాదులు, కక్షిదారులు కలిసి సమన్వయం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు పినకాన ఆజయ్ కుమార్, టెక్కలి, నందిగాం, మెళియాపుట్టి, టెక్కలి ఎక్సైజ్ పోలీస్‌లు, న్యాయవాదులు పేడాడ బాబురావు, గోవిందరావు, పైల చంద్రుడు, ఆనందరావు, లక్ష్మీపతి, సూర్యరాజు, పాల్గొన్నారు.

నేడు పాఠశాల సమయం మార్పు

టెక్కలి: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం పాఠశాల సమయాల్లో మార్పు చేశారు. రాష్ట్ర విద్యాశాఖ కమీషనర్ ఆదేశాల మేరకు ప్రత్యేక టైం టేబుల్ అమలు కానుంది. ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాల పని దినంగా సూచించారు. కూటమి ప్రభుత్వ పాలనలో భాగంగా విద్యా సంస్కరణల్లో భాగంగా ప్రతి శనివారం నోబ్యాగ్ డేగా పాటించాలని సూచించారు. శనివారం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు విద్యార్థులచే యోగాసనాలు చేయించాలి. ఆనంతరం 8 గంటల నుంచి 9 గంటలలోపు అల్పాహారం ఇవ్వాలి. 9 నుంచి మధ్యాహ్నం వరకు యధావిధిగా తరగతులు నిర్వహణ, అనంతరం మధ్యాహ్నం పన్నెండున్నరకు మధ్యాహ్న భోజనం విద్యార్థులకు ఏర్పాటు చేసి విడిచిపెట్టాలి. ఇందుకు సంబంధించిన ఫోటోలు ఎప్పటికప్పుడు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది.



పరిసరాలు శుభ్రం చేస్తున్న విద్యార్థులు

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

కవిటి: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సింహాచలం నాయుడు అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. శనివారం జరగబోయే అంతర్జాతీయ యోగా దినోత్సవం ముందస్తు ఏర్పాట్లలో భాగంగా కళాశాల ప్రాంగణంలో పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాన్ని సేకరించి తగులబెట్టారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆరోగ్య భారత్ నిర్మాణంలో భాగంగా కళాశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అంతర్జాతీయ యోగా దినోత్సవంలో అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్. పిఒ జె.పాపారావు, జి.విష్ణుమూర్తి, పి.హరి, కె.ఉగాది నాయుడు, డి.అనసూయ, బి.శ్రీనుబాబు, కె.కరుణశ్రీ, డి.రమేష్, ఎల్.ఆనంద్, బి.అంజన, విద్యార్థులు పాల్గొన్నారు.

విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి



విత్తనాలు పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్

లావేరు: రాయితీపై ప్రభుత్వం అందజేస్తున్న వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తామాడ మాజీ సర్పంచ్ గొర్లె శ్రీనువాసరావు అన్నారు. శుక్రవారం తామాడలో రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు రాయితీపై విత్తనాలు, పురుగు మందులు, యంత్ర పరికరాలు ఆదజేస్తుందన్నారు. కార్యక్రమంలో విలేజీ వ్యవసాయ సిబ్బంది నీరజ, మోడల్ స్కూల్ చైర్మన్ అల్లంశెట్టి వెంకటరావు, నీటి సంఘం డైరెక్టర్ గొర్లె మాధవరావు, బి.శ్రీరాములు, మహంతి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నాటుసారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి



టెక్కలి రూరల్ : మాట్లాడుతున్న రామచంద్రరావు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

నాటుసారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని శ్రీకాకుళం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా ప్రభావిత 35 గ్రామాలు కలిగిన రెండు మండలాల్లో నందిగాం, మెలియాపుట్టి 17 గ్రామాలు నాటు సారా రహిత గ్రామాలుగా ప్రకటించడం జరిగిందని, మిగిలిన 18 గ్రామాలు కూడా నాటు సారా పూర్తిగా నిర్మూలించే లక్ష్యంగా పనిచేయాలన్నారు. నాటుసారా తయారు చేసిన వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. అరెస్ట్ అయిన వారిపై బైండోవర్ చేసి మరలా నేరానికి పాల్పడితే రూ. 2 లక్షలు అపరాధ రుసుం వసూలు చేయాలన్నారు. నాటుసారా తయారీకి అవసరమైన ముడి సరుకులు సరఫరా చేసిన వారిని గుర్తించి వారిపై కూడా కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపించాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిఐ షేక్ మేరా సాహెబ్, పలాస ఎఇఎస్ గోపాలకృష్ణ, ప్రొహిబిషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పలాస: దుఖాణాల్లో వ్యాపారులు నల్లబెల్లం విక్రయిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమీషనర్ పైడి రామచంద్రరావు వ్యాపారులకు హెచ్చరించారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో బెల్లం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం కార్యాలయ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. సమావేశంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎం. గోపాలకృష్ణ, ఎక్సైజ్ సిఐ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు పెంచాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

ప్రజాశక్తి- పలాస

మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పెంచాలని ఆయా సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కార్యాలయంలో రాష్ట్ర సంఘం పిలుపు మేరకు చేపడుతున్న సమ్మెలో భాగంగా ఎమ్మెల్యే గౌతు శిరీషకు వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నామన్నారు. పనిఒత్తిడి పెరుగుతున్నా జీతాలు పెంచడం లేదన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలు తమకు అందడం లేదని, చాలిచాలని జీతాలతో జీవనం సాగించడం కష్టంగా ఉందని, తమకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఉద్యోగులకు న్యాయం చేసేలా చూస్తామని హామీఇచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో కామేశ్వరరావు, సత్యన్నారాయణ, సురేష్, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కూల్చివేతలు తగదు



కూల్చి వేసిన గృహాన్ని పరిశీలిస్తున్న రవికుమార్

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

గ్రామాల్లో అక్రమంగా నివాస గృహాలను కూల్చి వేయడం తగదని, భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. శుక్రవారం సరుబుజ్జిలి మండలంలోని చిగురువలసలో ఆయన పర్యటించారు. ఇటీవల రాజకీయ కారణాలతో వైసిపి కార్యకర్త జరుగుళ్ల రాజారావు నివాస గృహాన్ని కూల్చి వేయడంతో సరుబుజ్జిలి మండల వైసిపి నాయకులతో కలిసి ఆయన ఆ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యంగా ఉండాలని బాధితులకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేక ప్రశ్నిస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలపై ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతుందని, భవిష్యత్‌లో ఇటువంటి చర్యలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. టిడిపి నాయకులు గ్రామాల్లో కక్షపూరిత రాజకీయాలుమాని అభివృద్ధి కోసం పాటు పడాలన్నారు. పరామర్శించిన వారిలో సరుబుజ్జిలి మండల జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు, మాజీ జెసిఎస్ కన్వీనర్ అత్తులూరి రవికాంత్, మాజీ పిఎసిఎస్ చైర్మన్ కోవిలాపు శేఖర్, డకరవలస సర్పంచ్ సురవరపు తిరుపతిరావు, మెట్ట నందేసు, కెప్టెన్ రామారావు, నాయకులు చల్ల ఎర్రయ్య, పల్లి శాంతారావు, ముద్దాడ రంజిత్, దనాల చిరంజీవి, రవి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

శ్రీకాకుళం సిటీ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పాటై 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బ్యాంకు చైర్మన్ పిలుపుమేరకు దేశ వ్యాప్తంగా మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించారు. శ్రీకాకుళం రీజనల్ ఆఫీస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున రక్తదాన శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. మొత్తం 200 యూనిట్ల రక్తాన్ని బ్యాంకు ఉద్యోగులు దానం చేశారు. శ్రీకాకుళం, పలాస, సోంపేట, కంచిలి క్లస్టర్లలో రక్తదాన శిబిరాలు నిర్వహించి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి అందజేసినట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బిఐ మేనేజర్ ఉదయకుమార్ సింగ్, రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పెంకి చైతన్య కుమార్, కె. సత్య నారాయణ, జి.రమణ, ఎస్‌బిఐ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కిషోర్, స్టాఫ్ యూనియన్ రీజనల్ సెక్రటరీ వెంకటరమణ పాల్గొన్నారు.

రణస్థలం: మండల కేంద్రంలోని సూర్య ఆస్పత్రి వద్ద సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఇడదాసుల వెంకట సత్యన్నారాయణ, తిరుపతి రాజుల తండ్రి 15వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 16 మంది రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకుకు అందజేశారు. ఈ శిబిరంలో ఫౌండేషన్ అధ్యక్షులు తిరుపతి రాజు, సూర్య ఆస్పత్రి డాక్టర్ ఇడదాసుల యశ్వంత్, సభ్యులు పసుపురెడ్డి సురేష్, బలివాడ శ్రీనివాసరావు, మహంతి నీలాకృష్ణ, జగ్గురోతు లక్ష్మణరావు, బ్లడ్ బ్యాంకు మేనేజర్ తొత్తడి మణికంఠ పాల్గొన్నారు.

నష్టపోతున్న ఆదివాసీలు

మెళియాపుట్టి: మెగా డిఎస్‌సిలో జిఒ నెంబర్ మూడు రద్దు కారణం చూపుతో 881 ఎస్‌జిటిఎస్ పోస్టులకు ఆదివాసీలకు కేవలం 80 పోస్టులు మాత్రమే ఆర్‌ఒఆర్ అని కేటాయించడం ఆదివాసి నిరుద్యోగులు నష్టపోవాల్సి వస్తుందని ఆదివాసి సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరహాల కృష్ణారావు అన్నారు. శుక్రవారం మండలంలోని అచ్చినాపురంలో గిరిజనులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 600 గురుకుల పోస్టులకుగాను ఆర్‌ఒఆర్ ద్వారా 180 పోస్టులు మాత్రమే కేటాయించడంతో ఆదివాసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. పదేళ్లు పైబడి కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్‌గా పనిచేస్తున్న 2 వేల మంది గిరిజన అధ్యాపకులకు రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసి సేన మండల అధ్యక్షులు జన్ని కూర్మారావు, రాష్ట్ర ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి వై.రాజు, ఎఐఎఫ్ జిల్లా అధ్యక్షులు సింహాచలం, ఉపాధ్యక్షులు తిరుపతిరావు, నాగరాజు, బాలకృష్ణ, జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

దినచర్యలో యోగా భాగం కావాలి



శ్రీకాకుళం సిటీ : సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి- ఆమదాలవలస

యోగా ప్రతిఒక్కరి జీవితంలో దిన చర్యలో భాగం కావాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన మాక్ యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. పలు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగా సాధన శారీరక మానసిక ఆరోగ్యాన్ని సమతుల్యంగా పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, టిడిపి నాయకులు మొదలవలస రమేష్, నారాయణపురం ఆనకట్టు చైర్మన్ సనపల ఢిల్లేశ్వరరావు, యోగా గురువు బగాది పాపారావు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ: విశాఖలో నిర్వహించే యోగాంధ్ర విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. నగరంలోని విశాఖ ఎ కాలనీ క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

ఎంపీ సైకిల్ ర్యాలీ

యోగా దినోత్సవం విజయవంతం కావాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు ఆకాంక్షించారు. అరసవల్లిలో యోగాసనాలు వేశారు. సైకిల్‌యాత్ర నిర్వహించారు.

ఇచ్ఛాపురం: పట్టణంలో సురంగి రాజా క్రీడా మైదానంలో ఏలియన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న యోగా సాధన కార్యక్రమం రెండవ రోజు శుక్రవారం కొనసాగింది. యోగాంధ్ర శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఏలియన్స్ క్లబ్ అధ్యక్షులు లోపింటి నరసింహమూర్తి ఆధ్వర్యంలో జరిగిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ రమేష్ మాట్లాడుతూ 21న ఇదే మైదానంలో నిర్వహించనున్న యోగాంధ్ర దినోత్సవం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున యువత, క్రీడాకారులు, సీనియర్ సిటిజన్స్, మెప్మా, మున్సిపల్, సచివాలయ సిబ్బంది హాజరుకావాలన్నారు.



ప్రింటర్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పాఠశాలకు ప్రింటర్ వితరణ

నౌపడ: సంతబొమ్మాళి మండలం బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 2005 పదవ తరగతి బ్యాచ్ శుక్రవారం ప్రింటర్ వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రవికుమార్ మాట్లాడుతూ పాఠశాల అవసరాలకు సహాయం అందించిన పూర్వ విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. ముద్దపు ఆనందరావు, రవికుమార్, తిరుపతి పాల్గొన్నారు.



క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

క్షయ నిర్మూలనే లక్ష్యం

కోటబొమ్మాళి: దేశ వ్యాప్తంగా క్షయ వ్యాధిని సమూలంగా నిర్మూలించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతుందని మండలం కొత్తపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ వరుణ్ తెలిపారు. శుక్రవారం మండలం దంత ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పరిధిలో సరియాపల్లిలో క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా క్షయవ్యాధి లక్షణాలు, వ్యాధిసోకిన తర్వాత వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుని నిర్దేశించిన మందులను వాడడం వలన వ్యాధి తీవ్రతతో పాటు వ్యాప్తిని అరికట్ట వచ్చన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి పిహెచ్‌సి. సూపర్‌వైజర్లు, టిబి సూపర్‌వైజర్, దంత ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సిబ్బంది సిహెచ్‌ఒ, హెల్త్ అసిస్టెంట్, ఎఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకారం

వజ్రపుకొత్తూరు: పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని సర్పంచ్ బత్తిని కుసుమ హేమంతరావు అన్నారు. శుక్రవారం పల్లిసారది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సుమారు రూ.5 వేలు విలువ చేసే పాఠశాల దినచర్య పుస్తకాలను తన సొంత డబ్బులతో అందజేశారు. గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నడిపేందుకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. హెచ్‌ఎం యవ్వారి కాంతారావు మాట్లాడుతూ దినచర్య పుస్తకాల వలన పిల్లలపై తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల పర్యవేక్షణ మెరుగుపడి విద్యలో నాణ్యత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ దున్న కవిత, ఉపాధ్యాయులు గుంట కోదండరావు, ఎం.హరినాథ్, ఎస్.పాపారావు, విష్ణుమూర్తి, బి.అన్నపూర్ణ, కె.మాధవరావు, ఉపాధ్యాయేతర సిబ్బంది సీతమ్మ, నాగభూషణ్, శివాజీ పాల్గొన్నారు.

శాశ్వత భవనం నిర్మించాలి

పోలాకి: మండలం దీర్ఘాసి పంచాయతీ కింజరాపువాని పేటలో గల పాఠశాల అద్దె భవనంలో ఉందని, పాఠశాల ప్రారంభం రోజున ఆ పాఠశాలను తెరవగా తేనెటీగలు పట్టుపెట్టడం వలన నలుగురు విద్యార్థులు గాయాల పాలయ్యారని పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ జి.షణ్ముఖరావు మండల విద్యాశాఖ అధికారి-2 లింగరాజుకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే శాశ్వత భవనం నిర్మించి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఆయన కోరారు.

బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి

కోటబొమ్మాళి: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన సిఎస్‌బి బ్యాంక్ సేవలను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్ అన్నారు. శుక్రవారం నూతన సిఎస్‌బి బ్యాంకును ప్రారంభించారు. అన్ని రకాల బ్యాంకులు మండల కేంద్రంలో ఏర్పాటు చేయడం వల్ల మండలం అభివృద్ధి చెందడంతో పాటు ప్రజలకు మరింత బ్యాంకు సేవలు దగ్గరవు తాయన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వెలమల విజయలక్ష్మి, కామేశ్వరి, మాజీ ఎంపిపి తర్ర.రామకృష్ణ, మాజీ జెడ్‌పిటిసి నంబాల శ్రీనివాసరావు, జోనల్ బ్యాంకు మేనేజర్ పాల్గొన్నారు.

పశు వైద్యాధికారిగా జ్యోత్స్న

లావేరు: మండలంలోని బుడుమూరు పశు వైద్యాధికారిగా జ్యోత్స్న శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన హేమంత్ కుమార్‌కు పెనుబర్తికి బదిలీ అయ్యారు. జ్యోత్స్న కళింగపట్నం నుంచి బుడుమూరుకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూగ జీవాలు, పాడి రైతులకు అందుబాటులో ఉంటూ సేవలు అందించడం జరుగు తుందన్నారు.

బోయిన కుటుంబానికి పరామర్శ

కోటబొమ్మాళి: టిడిపి రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర కళింగ కోమటి సంఘం అధ్యక్షులు బోయిన గోవిందరాజులు, టిడిపి మండల అధ్యక్షుడు బోయిన రమేష్ మాతృమూర్తి ప్రేమకుమారి మృతి చెందడంతో శుక్రవారం పలువురు నాయకులు పరామర్శించారు. గోవిందరాజులతో పాటు ఆయన సోదరుడు రమేష్, గోపాల్ తదితరులను పరామర్శించి సంతాపం తెలిపారు. పరామర్శించిన వారిలో పాతపట్నం మాజీ ఎమ్మెల్యే, టిడిపి జిల్లా అధ్యక్షుడు కలమట వెంకట రమణ, నాయకులు, కార్యకర్తలు పరామర్శించారు. ఆమె చిత్రపటానికి నివాళ్లర్పించారు.

విద్యామిత్ర కిట్లు పంపిణీ

మెళియాపుట్టి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్లను ఎంఇఒలు ఎస్.దేవేంద్రరావు, ఎం. పద్మనాభ రావు, మాజీ ఎఎంసి వైస్ చైర్మన్ రాజశేఖర్ రెడ్డి శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమయానికి విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ చేయడంతో పాటు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వం సన్న బియ్యం అందించడం గొప్ప విషయమన్నారు. హెచ్‌ఎం డి.మహాలక్ష్మి, బసవ పరమేశ్వర్ రెడ్డి, రాజ మోహన్, ఎస్‌ఎంసి చైర్మన్ చినబాబు పాల్గొన్నారు.

కొత్తమ్మతల్లి హుండీ లెక్కింపు

కోటబొమ్మాళి: స్థానిక శ్రీ కొత్తమ్మతల్లి ఆలయంలో హుండీలను శుక్రవారం తెరిచి లెక్కించగా 86 రోజులకు రూ. 5,59,597లు ఆదాయం వచ్చిందని ఆలయ కార్య నిర్వహణాధికారి వి.రాధాకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాకుళం దేవాదాయశాఖ సీనియర్ అసిస్టెంట్ జి.వి.బి.ఎస్. రవికుమార్, యూనియన్ బ్యాంక్ సిబ్బంది, పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.